క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థిని పరీక్షిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: మండల కేంద్రంలోని ఎస్సీ బాల, బాలికల హాస్టల్ విద్యార్థులకు శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, డాక్టర్ పూర్ణలత వైద్య పరీక్షలు చేశారు. వారు మాట్లాడుతూ హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. తద్వారా రక్తహీనత, టైఫాయిడ్, డయేరియా తదితర వ్యాధులను నివారించవచ్చన్నారు. అనంతరం నీటి నాణ్యత పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, సూపర్‌వైజర్ చిన్నమ్మ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఏఎన్‌ఎం శాంతకుమారి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గీతాలాపన

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ ఆస్థాన మండపంలో శుక్రవారం నిర్వహించిన భక్తి భజన, జానపద గీతాల ఆలాపన కార్యక్రమం ఆకట్టుకుంది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు జానపద, భక్తిగీతాలను ఆలపించారు. అనంతరం ఆలయ అధికారులు, సిబ్బంది వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఐరాల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో వెంకటేశు తెలిపారు. ఆయన శుక్రవారం పొలకల జెడ్పీ హైస్కూల్, సబ్ సెంటర్ వద్ద ఉన్న పిచ్చి మొక్కలు, రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను, వాటర్ ట్యాంకుల దగ్గర చెత్తను శుభ్రం చేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కుసుమకుమారి, ఈవో చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి శరణ్‌తేజ, వైస్ సర్పంచ్ సురేంద్రనాయుడు పాల్గొన్నారు.

25న హుండీ లెక్కింపు

కాణిపాకం: ఈ నెల 25వ తేదీన కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీలోని కానుకలను లెక్కిస్తున్నట్లు ఈవో వెంకటేశు తెలిపారు. ఉదయం 7 గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. 20 రోజులకు సంబంధించిన హుండీలోని కానుకలను లెక్కిస్తామని, అధికారులు, సిబ్బంది తప్పక హాజరుకావాలని పేర్కొన్నారు.

నాగాలమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆడినెలను పురస్కరించుకుని శుక్రవారం సంతపేటలోని శ్రీనాగాలమ్మ ఆలయంలో జాతరను ఘనంగా నిర్వహించారు. మూలస్థానంలోని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అలాగే ఆలయ ఆవరణలో అమ్మవారి శిరస్సును కొలువుదీర్చారు. నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ఆలయ సమీపంలోని పుట్టలో పాలుపోసి మొక్కులు చెల్లించారు. ఈ క్రమంలోనే రెండో శనివారం భక్తుల చేతుల మీదుగా పాలాభిషేకం, మూడో శుక్రవారం నిప్పు కుండలతో ఊరేగింపు, నాలుగో శుక్రవారం జలాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు కంద తెలిపారు.

సంకటంగా వ్యవ'సాయం'

- పెట్టుబడి సాయం కోసం ఎదురుచూపు
- మంజూరు కాని కొత్తరుణాలు
- బంగారు తాకట్టు పెట్టి సాగు చేయాల్సిన దుస్థితిలో రైతులు
- రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్న హామీ గాలికేనా?

అడపాదడపా జల్లులు కురుస్తుండడంతో మండలానికి చెందిన రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. పొలాలను దుక్కులు చేసుకుంటున్నారు. నారు మడులు సిద్ధం చేసుకుంటున్నారు. అయితే చెరువుల్లోకి మాత్రం నీరు రాలేదు. మరోవైపు ప్రభుత్వం ఇస్తామని చెప్పిన పెట్టుబడి సాయంపై ఇంకా ఎలాంటి ప్రకటనా రాలేదు. అదును దాటిపోతుండడంతో అన్నదాతలు అప్పులు చేసి వ్యవసాయం పనులు మొదలుపెట్టేశారు. ముస్ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన మాత్రం రైతులను వెంటాడుతోంది.



వేరుశనగ పంటలో చెత్తను తొలగిస్తున్న మహిళా కూలీలు

ఐరాల: మండలంలో 9వేల మంది రైతులు ఉన్నారు. వారు వేరుశనగతోపాటు, వరి, టమాట, వంగ, బీర, కాకర తదితర పంటలు సాగు చేస్తున్నారు. వారికి గత ఐదేళ్లలో ప్రభుత్వం పీఎం కిసాన్, రైతు భరోసా కింద ఏటా మూడు విడతల్లో రూ.13,500 ఖాతాల్లో జమచేసేది. ఖరీఫ్‌లో తొలి విడతగా పీఎం కిసాన్ కింద రూ.2 వేలు, రైతు భరోసా కింద రూ.5,500 కలిపి మొత్తం రూ.7,500 అందేది. ఈ నిధులు దుక్కులు, విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు ఎంతగానో ఉపయోగపడేవి. పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం ఉండేది కాదు.

నేడు తప్పని ఎదురుచూపులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నెలరోజులైనా పెట్టుబడి సాయం గురించి పట్టించుకోలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రైతులు వ్యవసాయ పనులు మొదలు పెట్టినా ప్రభుత్వం సాయం గురించి ఇంత వరకు ఎటువంటి ప్రకటనా చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతులకు ఇంతవరకు ఎలాంటి ఆర్థిక సాయం అందకపోవడంతో వారంతా ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్‌లో విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు మరిన్ని కష్టాలు తప్పవేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

దుక్కులకు సరిపోయిన పీఎం కిసాన్

ఇటీవల విడుదలైన పీఎం కిసాన్ నగదు రైతులకు దుక్కులకు మాత్రం ఉపయోగపడింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సాయం అందిస్తే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులకు వాడుకోవాల్సి ఉంటుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా సీజన్ ఆరంభంలోనే రైతు భరోసా పథకం నిధులను అన్నదాతలకు అందించేది. ఈ ఏడాది కూడా మే లోనే రూ.5,500 చొప్పున రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాల్సి ఉంది. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిధుల విడుదల నిలిచిపోయింది. కొత్తగా ఏర్పాటైన కూటమి సర్కారు స్పందించకపోవడంతో రైతులు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

మంజూరు కాని కొత్త రుణాలు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులు పంట రుణాలను బ్యాంకుల్లో పొందలేని పరిస్థితి వచ్చింది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఆమోదించడంలో జాప్యం కారణంగా పాత రుణాలను రెన్యూవల్ చేయడం మినహా కొత్తగా రుణాలు మంజూరు కావడంలేదు. దీంతో సేద్యం పనుల కోసం రైతులు ప్రైవేట్ ఫైనాన్స్ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోంది. అధిక వడ్డీల భారం మోయాల్సిన దుస్థితి దాపురించింది. ఇంట్లో బంగారు నగలను తాకట్టు పెట్టి రుణాలు తీసుకుని వ్యవసాయ పనులు సాగించాల్సి వస్తోంది. అన్నదాత సుఖీభవ అంటూ పథకం మార్చడంలో చూపిన శ్రద్ధ పెట్టుబడి సాయం అందించడంలో చూపించి ఉంటే సాగు సంబరంగా ఉండేది.

అంతంతమాత్రంగానే వర్షాలు

వర్షాలు కూడా అంతంతమాత్రంగానే కురుస్తుండడంతో చెరువుల్లోకి నీరు రాలేదు. దీంతో నీటి సౌకర్యం ఉన్న రైతులు మాత్రం వరి పంట సాగు చేశారు. వేరుశనగ సాగు చేసిన రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. సకాలంలో వర్షాలు కురవక, పెట్టుబడి సాయం అందక, రుణాలు మంజూరు కాక, అన్నదాత కష్టాల సుడిగుండంలోనే ఈ సారి సేద్యపు పనులు ఆరంభించాల్సి వచ్చింది.



జంగాలపల్లెలో బోరు వద్ద సాగు చేసిన వరి పంట



ఎండిపోయిన వీ.ఎస్ అగ్రహారం చెరువు



ఎం.పైపల్లెలో వరి నాటుతున్న కూలీలు

దళిత కాలనీలను చిన్నచూపు చూస్తే సహించేది లేదు

పూతలపట్టు: ప్రభుత్వ అధికారులు రాజకీయలు పక్కన పెట్టి అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే మురళీమోహన్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలో దాదాపు 46 దళిత గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందన్నారు. అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను వెంటనే తొలగించాలని ఏఈకి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుమారి, జెడ్పీటీసీ దేవిక, వైస్ ఎంపీపీలు ద్వారకనాథరెడ్డి, మురళీకృష్ణ, ఎంపీడీవో ప్రసన్నకుమారి, తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, సీఐ సుదర్శన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న మధుసూదనరెడ్డి

బంగారుపాళెం: మామిడిలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన దిగుబడులు సాధించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం తిమ్మోజుపల్లెలో మామిడి కోత అనంతరం తోటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అత్యధికంగా రైతులు మామిడి తోటలు సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం మామిడి తోటల్లో కోత పూర్తయిందన్నారు. ఈ క్రమంలో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. వైఎస్సార్ విశ్వవిద్యాలయం ఉద్యాన శాఖ శాస్త్రవేత్త రాజశేఖర్ మాట్లాడుతూ మామిడి చెట్ల కొమ్మల కత్తిరింపు వల్ల మెరుగైన ఫలితాలు పొందవచ్చన్నారు. కొమ్మలను కత్తిరించిన వెంటనే పెద్ద కొమ్మల భాగానికి లీటరు నీటిలో 10 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను కలిపిన ద్రావణాన్ని పూయాలన్నారు. అలాగే లీటరు నీటిలో 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణాన్ని కలిపి చెట్లు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. ఎకరాకు జనుము, జీలుగ విత్తనాలను 12 నుంచి 15 కిలోలు చల్లుకుని 30 రోజుల తరువాత దున్నాలన్నారు. సూక్ష్మధాతువుల నివారణకు లీటరు నీటిలో 5 గ్రాముల జింక్ సల్ఫేట్, 2 గ్రాములు బోరాన్ మందు కలిపి 20 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలని సూచించారు. పొలుసు పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఎంఐపీ పీడీ సుబ్రమణ్యం, ఉద్యానశాఖ అధికారి సాగరిక, రైతు సేవా కేంద్రం సహాయకుడు రాజేంద్రనాయుడు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



ఎస్సీ బాలికల హాస్టల్ వార్డెన్‌కు సూచనలు చేస్తున్న డాక్టర్ లోహిత్ చెంగల్ రాయన్

బంగారుపాళెం: సంక్షేమ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థుల ఆరోగ్యంపై వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తుంబకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్ తెలిపారు. ఆయన శుక్రవారం ఎస్సీ, బీసీ బాలికల హాస్టళ్లను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. వంటగది, తాగునీటి ట్యాంక్, బాత్‌రూమ్‌లను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. వాతావరణంలో మార్పుల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దగ్గు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రిలో చూపించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ డాక్టర్ రమేష్, సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తవణంపల్లె: మండలంలోని టీ.పుత్తూరులో బెంగళూరుకు చెందిన వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్, గుండె, కిడ్నీ, కీళ్లు, ఎముకలు, బీపీ, మధుమేహం, గ్యాస్ట్రిక్, కంటి వ్యాధులతో బాధపడుతున్న 250 మందికి వైద్యులు పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవిచంద్రారెడ్డి, వైద్యాధికారులు విజయ్‌కుమార్, సాయిసతీష్, రచన్‌గుప్తా, ప్రణీత్‌కుమార్, చల్లా వెంకట్ సాయికపిల్, అభిషేక్ పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: గ్రామీణ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జి.గొల్లపల్లెలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆయన 45 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు, గర్భిణులకు పరీక్షలు చేశారు. ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డలకు క్షేమమని గర్భవతులకు సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజామణి, సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని 33, 11 కేవీల విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఈఈ మునిచంద్ర తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. చిత్తూరు నగరంలోని చర్చివీధి, ఎంజీఆర్‌వీధి, పొనియమ్మన్ గుడివీధి, సంతపేట, విజయలక్ష్మి కాలనీ, సాయినగర్‌కాలనీ, గాండ్లవీధి, సంతపేట మీసేవ దగ్గర, తిమ్మసముద్రం, దొంగలబావివీధి, ఇరువారం, మురగానిపల్లె, ఎస్‌బీఐకాలనీ, శాంతినగర్, సంజయ్‌గాంధీ కాలనీ, బార్బర్‌కాలనీ ప్రాంతాల్లో ఉండదన్నారు. పాలసముద్రం మండలం, పరిసర ప్రాంతాలు, గుడిపాల మండలంలోని పానాటూరు పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు మార్పును గమనించాల్సిందిగా కోరారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోండి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం సవటపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు.

వాహన చట్టాన్ని అధిగమించొద్దు



బహుమతి అందజేస్తున్న డీటీసీ నిరంజన్‌రెడ్డి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వాహన క్రయ, విక్రయాలతోపాటు బండి నడిపే వ్యక్తి కూడా వాహన చట్టాన్ని అధిగమించకూడదని డీటీసీ నిరంజన్‌రెడ్డి అన్నారు. చిత్తూరు నగరం కట్టమంచిలో శుక్రవారం ఓ వాహన షోరూంను ప్రారంభించి వాహన చట్టాలపై అవగాహన కల్పించారు. మార్కెట్‌లోకి ఎలక్ట్రికల్ వాహనాలు వస్తున్నాయన్నారు. వాటి నిర్వహణ విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. వాహన చట్టానికి అనుగుణంగా వ్యవహరించాలని చెప్పారు. అనంతరం వాహన కొనుగోలుదారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు జీవరత్నంరెడ్డి, కార్తికేయన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాల కిట్లను స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు పంపిణీ చేశారు. ఆయన శుక్రవారం గాండ్లపల్లె, సంతపేట మునిసిపల్ పాఠశాలలతో పాటు బీఎస్.కణ్ణన్ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకుఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన స్టూడెంట్ కిట్లను నగర మేయర్ అముదతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్, టీడీపీ నేతలు హేమలత, యువరాజు, శేషాద్రి, ఆనంద్ పాల్గొన్నారు.

దోమకాటుతో జాగ్రత్త



- దోమల వ్యాప్తితో సీజనల్ వ్యాధులు
- వాతావరణ మార్పులతో వ్యాధుల భయం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

విజయపురం: వర్షాకాలం ప్రారంభం కావడంతో వాతావరణంలో మార్పులతోపాటు సీజనల్ వ్యాధులూ వచ్చేస్తాయి. ఇటీవల వారం రోజులుగా అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడుతుండడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. వీధుల్లో ఉండే మురుగు నీరు కారణంగా దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. ఇళ్లలో సైతం తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు. అలాగే ఇంటి పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు రాకుండా ఉంటాయి. వ్యాధులు బారిన పడితే వైద్యుల సలహా తప్పనిసరిగా తీసుకుంటే మంచిది.

వ్యాధుల పెరిగే అవకాశం

ప్రస్తుతం వారం రోజులు చిరు జల్లులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు పడుతున్నాయి. వర్షపు నీరు ఇళ్ల చుట్టూ అక్కడక్కడా నిలిచి దోమలకు నిలయంగా మారింది. ఫలితంగా గ్రామాల్లో అక్కడక్కడ ప్రజలు జలుబు, జ్వరాల బారిన పడుతున్నారు. వర్షాలు జోరుగా పడితే జలుబు, జ్వరం, దగ్గుతో పాటు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వీటికి సబంధించిన లక్షణాలు కనిపిస్తే సమీపంలో ఉన్న వైద్యశాలలో సంప్రదించాలని వైద్యులు కోరుతున్నారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్యుల సలహా తీసుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఆహారం, నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. మల, మూత్ర విసర్జన అనంతరం చేతులను శుభ్రంగా చేసుకోవాలి.
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- చిన్న పిల్లలకు ఒంటి నిండా దుస్తులు కప్పి ఉంచేలా చర్యలు తీసుకోవాలి.
- పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగిన తర్వాతనే తినాలి.
- ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, డ్రమ్ములు, కొబ్బరి చిప్పలు ఉంచకూడదు.
- ఇంటి పరిసరాలలో ఉన్న నీటిని బయటకు పంపివేయాలి.
- పేడదిబ్బలు గ్రామ సమీపంలో లేకుండా చూడాలి.
- వేడి చేసి చల్లార్చిన నీటిని తీసుకోవాలి.
- రాత్రి పూట దోమ కాటుకు గురికాకుండ దోమ తెరలు వాడాలి.

తగిన జాగ్రత్తలు పాటించాలి

ప్రస్తుతం గ్రామాల్లో వర్షాలు పడుతున్నాయి. ప్రజలంతా తగిన జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉంటున్నారు. వ్యాధి లక్షణాలు ఉంటే వైద్యుల వద్దకు వెళ్లాలి. వైద్య, పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో ఉన్న వాళ్లకి వ్యాధులపై అవగాహన కల్పించాలని చెప్పాం. జలుబు, జ్వరం ఉన్నట్లయితే వెంటనే వైద్యుల సలహా తీసుకోవాలి. – డాక్టర్ సోమశేఖర్, పీహెచ్‌సీ, విజయపురం

బాధితులకు అండగా ఉంటా



బాధితులకు చెక్కు అందజేస్తున్న సునీల్‌కుమార్

పూతలపట్టు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు నిరంతరం అండగా ఉంటానని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం పాలకూరులో టీడీపీ నేతల దాడిలో గాయపడిన హరీష్, హరిని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విష సంస్కృతిని టీడీపీ అమలు చేస్తోందని విమర్శించారు. ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందిపోయి దాడులు చేయడం సబబు కాదన్నారు. బాధితులకు వైద్య చికిత్సల కోసం పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన సహాయం ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున అందజేశారు. పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

24న సంకటహర చతుర్థి పూజలు

కాణిపాకం: ఈనెల 24వ తేదీన కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సంకటహర చతుర్థి పూజలు నిర్వహిస్తున్నట్లు ఈవో వెంకటేశు తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు చతుర్థి పూజలు చేస్తామని తెలిపారు. రాత్రి 7 గంటలకు స్వర్ణ రథోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.